క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

శాయంపేట : తనతో అసభ్యంగా మాట్లాడిన స్థానిక పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ తోపాటు మల్టీపర్పస్ వర్కర్ మారపల్లి మోహన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు తాను ఫిర్యాదు చేసినట్లు మండల కేంద్రానికి చెందిన బి.పద్మావతి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తాను మార్చి 2023 వరకు ఇంటి, నల్లా పన్ను చెల్లించినా 'తమాషా చేస్తున్నావా, ఏడాదిగా రోడ్డుపై కంకరణ నిల్వ చేస్తున్నావా' అని దూషిస్తూ అవమానించారని ఆవేదన వ్యక్తం చేసింది. తనను దూషించి అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.

గుడిసె దగ్ధంపై విచారణ



నడికూడ : మండల కేంద్రానికి చెందిన యాదెండ్ల పోషమ్మ ఇల్లు దగ్ధమైన ఘటనపై తహసీల్దార్ మహేందర్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ లావుడ్య హేమ నాయక్ గురువారం విచారణ చేపట్టారు. గుడిసెను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ముగ్గురు పంచుల సమక్షంలో విచారణ చేశారు. గుడిసె పూర్తిగా దగ్ధమై 20 కేజీల బియ్యం, సామగ్రి కాలిపోగా సుమారు రూ.40 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు.

అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

● రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావును కలిసిన ఎంపీపీ కవిత



ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాల గ్రామ అభివృద్ధికి శాఖపరమైన తోడ్పాటు అందించాలని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి తన్నీరు హరీష్‌రావును ఎంపీపీ నిమ్మ కవిత కోరారు. ఈ మేరకు మంత్రిని ఎంపీపీ హైదరాబాద్‌లోని శాసన మండలి ఆవరణలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం గ్రామ అభివృద్ధికి సహకారం కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి గ్రామంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి హామీ ఇచ్చినట్లు ఎంపీపీ నిమ్మ కవిత మీడియాకు తెలిపారు. గ్రామంలో హెల్త్ సెంటర్ నిర్మాణానికి హామీ ఇచ్చినందుకు మంత్రి హరీష్‌రావుకు, సహకరించిన ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ వెంట నిమ్మ పవన్ తదితరులున్నారు.

నేటి నుంచి 'స్ట్రీట్ కార్నర్'

పరకాల : బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేటి (శుక్రవారం) నుంచి పరకాల మున్సిపాలిటీ పరిధిలో శక్తి కేంద్రాల ఆధ్వర్యంలో వారం రోజులపాటు స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై ప్రజలకు సమావేశాల్లో వివరించనున్నట్లు పేర్కొన్నారు. విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలను కోరారు.

'ఎల్‌ఐసీ పాలసీదారులకు డోకా లేదు'

ఆత్మకూరు : ఎల్‌ఐసీ పాలసీదారులకు డోకా లేదని ఎల్‌ఐసీ ఓబీసీ వరంగల్ డివిజనల్ అధ్యక్షుడు ఆర్‌ఎల్‌కె.ప్రసాద్, డివిజన్ బాధ్యులు సోమేశ్వర్, మధు, సురేందర్, వెంకటేశ్వర్లు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీలు దురుద్దేశంతో ఎల్‌ఐసీ ప్రతిష్ఠను దిగజార్చేలా కుట్ర పన్ని తప్పుడు నిరసనలు చేపడుతున్నాయని ధ్వజమెత్తారు. గతంలోనూ, ప్రస్తుతమూ ఎల్‌ఐసీ లాభాల్లో ఉందని స్పష్టం చేశారు.

రహదారి దిగ్బంధాన్ని విజయవంతం చేయాలి

దామెర : పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తుండడాన్ని నిరసిస్తూ ఈనెల 13న తలపెట్టిన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి 8 ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆందోళనల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని రవికుమార్ కోరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తోపాటు పార్టీ అగ్రనేత వెంకయ్య నాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

రాష్ట్ర అభివృద్ధికి అడ్డంకిగా బీజేపీ

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



పెంచికలపేటలో సీసీ రోడ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధికి అడ్డంకిగా మారిందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని నీరుకుళ్ల, పెంచికలపేట గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ గతంలో ఎన్నలూ లేనంతగా అభివృద్ధి చేశారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని మండిపడ్డారు. బీజేపీ నాయకులను గ్రామాలకు వస్తే తెలంగాణ ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని నిలదీయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్క సుమలత, సర్పంచ్‌లు కోరె లలిత, అర్షం బలరామ్, ఎంపీటీసీల ఫోరమ్ మండల అధ్యక్షుడు అర్షం వరుణ్‌గాంధీ, రెడ్‌క్రాస్ డైరెక్టర్ దుంపల బుచ్చిరెడ్డి, దామెర వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, దామెర బీఆర్ఎస్ అధ్యక్షుడు గండు రాము, నాయకులు కాకాని శ్రీధర్, హుస్సేన్, అర్షం మధుకర్, రాజేందర్, భిక్షపతి పాల్గొన్నారు.

దారి పునరుద్ధరించి న్యాయం చేయాలి



మాట్లాడుతున్న గురిమిల్ల రాజు

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన మొగిలిచెర్ల లచ్చమ్మ, శిరీషల ఇండ్లకు వెళ్లే దారిని పునరుద్ధరించి న్యాయం చేయాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురిమిల్ల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి, సావిత్రిబాయి పూలే మహిళా సంఘం, జైభీం పూలే వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బాధితులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. లచ్చమ్మ, శిరీష గతంలోనే వారి భర్తలు చనిపోగా వేదనలో ఉన్నారని తెలిపారు. వారి ఇళ్లకు వెళ్లే దారిని కొందరు కబ్జా చేసి గోడ నిర్మించారని తెలిపారు. గోడ నిర్మిస్తున్న సమయంలో ప్రశ్నించిన లచ్చమ్మ, శిరీషలపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపర్చారని చెప్పారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. కబ్జాదారుల నుంచి లచ్చమ్మ, శిరీషలకు ప్రాణహాని ఉందన్నారు. బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలని, దారిని పునరుద్ధరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ప్రధాన కార్యదర్శి జె.చక్రవర్తి, సావిత్రిబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గిన్నారపు సరోజన, జైభీం పూలే వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు గాజర్ల చిన్న, నాయకులు గోవింద్, మోహనకృష్ణ, విజయ, మనీల, రమేష్, మొగిలి, విలాస్ పాల్గొన్నారు.

ఆర్భాటమే తప్ప అభివృద్ధి శూన్యం

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకట్రాంరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకట్రాంరెడ్డి

దామెర : అధికార పార్టీ చేస్తున్నది ఆర్భాటమే తప్ప చేస్తున్న అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి తెలిపారు. మండలంలోని పసరగొండలో గురువారం ఆయన పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాల మధ్యాహ్న భోజనం, తరగతి గదులు, క్రీడా ప్రాంగణం, డంపింగ్ యార్డు, నర్సరీ, శ్మశానవాటికలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నం పురుగులు పట్టిన బియ్యంతో తయారు చేసిన భోజనం పెడుతున్నారని మండిపడ్డారు. తాగడానికి సరైన నీటివసతి కూడా లేదన్నారు. ఆర్భాటంగా ప్రారంభించిన క్రీడా ప్రాంగణం, స్మశానవాటిక, నర్సరీల పర్యవేక్షణ కరువైందని ధ్వజమెత్తారు. గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా నిరుపయోగంగా ఉంచుతున్నారని విమర్శించారు. పేర కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వినియోగించి చేపట్టిన అభివృద్ధి పనులను వాడుకలోకి తీసుకురాకపోవడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్థపాలనకు నిదర్శనమన్నారు. ఆయన వెంట ఆ పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలెపాక శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రజినీకర్ రెడ్డి, ఎంపీటీసీ శనిగరం కళ సుధాకర్, నాయకులు అమ్మ రమేష్, సుధాకర్, కుమారస్వామి, సురేష్, మహిపాల్‌రెడ్డి తదితరులున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పల్లవి

కమలాపూర్ : ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులనను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ పల్లవి కోరారు. 'మన ఊరు-మన బడి' కింద మండలంలోని ఉప్పల్‌లోని జెడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆమె గురువారం సందర్శించి పరిశీలించారు. మండలంలో మొదటి విడత కింద ఎంపికైన 16 పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట దేవేందర్‌రావు, ఉపసర్పంచ్ ఓదెలు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సంపత్‌రావు, వార్డు సభ్యుడు శ్రీధర్‌రావు, ఎంపీఓ విమల, ఏపీఓ రమేష్, హెచ్‌ఎం మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులున్నారు.

'ఉపాధి' పనులను వినియోగించుకోండి



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజేష్

శాయంపేట : ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను కూలీలు వినియోగించుకోవాలని సర్పంచ్ ఆకుతోట రాజేష్ కోరారు. మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో చేపట్టిన కాలువ పూడికతీత పనులను గురువారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. ఉపాధి హామీ పనులతో పేద కూలీలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ సంధ్యారాణి, ఉపసర్పంచ్ కటకం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని దీక్ష

● బీజేపీ, బీఆర్ఎస్, ప్రజాసంఘాల మద్దతు



న్యాయవాదుల దీక్షకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, నాయకులు

పరకాల: పరకాలలో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సిరికొండ సంజీవరావు, దుస్స జనార్దన్‌రావు డిమాండ్ చేశారు. ఈమేరకు సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ పరకాల కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రిలే నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ కేంద్రంగా, మున్సిపాలిటీగా సేవలందిస్తున్న పరకాలకు సబ్‌కోర్టును ఇవ్వకపోవడం అన్యాయమని వాపోయారు. బార్ అసోసియేషన్ పరకాల అధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్ మాట్లాడుతూ కేసుల విచారణకు హనుమకొండలోని సబ్‌కోర్టుకు హాజరు కావడం వలన కక్షిదారులు ఆర్థికంగా, సమయపరంగా చాలా నష్టపోతున్నట్లు చెప్పారు. కాగా, సబ్‌కోర్టు కోసం పరకాల కోర్టు ఎదుట రిలే నిరహార దీక్ష చేపట్టిన న్యాయవాదులకు బీజేపీ, బీఆర్ఎస్, జేడీఎస్‌తో పాటు ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. పరకాలలో సబ్‌కోర్టును మంజూరు చేయకుటే న్యాయవాదుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి స్పష్టం చేశారు. మద్దతు తెలిపిన వారిలో మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, బీఆర్ఎస్ పరకాల పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, నాయకులు దేవునూరి మేఘనాథ్, మేకల రాజవీర్, దుబాసి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఒగ్గు పూజారి మృతి



వెంకటనర్సు (ఫైల్)

ఐనవోలు : ఒగ్గు పూజారి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన మజ్జిగ వెంకటనర్సు(56) ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో ఒగ్గుపూజారిగా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి సమయంలో ఆలయ ఆవరణలో ఆయన కింద పడిపోయాడు. స్థానికులు గమనించి ఆయన్ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు సమాచారం. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి కొడుకు మజ్జిగ జైపాల్ రైతుబంధు సమితి మండల అధ్యక్షుడుగా పని చేస్తున్నాడు.

అవినీతి నిర్మూలనలో కీలకం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్, తదితరులు

పరకాల : అవినీతి నిర్మూలనలో యువత కీలకమని మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, పరకాల సివిల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ గౌతమ్ చౌహాన్ తెలిపారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ (యాక్) ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను వారు గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో యాక్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే.ముస్తాఫా, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సుకుమార్, నడికూడ మండల అధ్యక్షుడు నాగరాజు, సభ్యులు నాగరాజు, చందు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఆత్మకూరు : మండలంలోని హౌజుబుజుర్గు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మంగలపెల్లి బాబు, గొపరవోయిన పద్మీల, నీరుకుళ్లలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు అర్షం భిక్షపతి, పెంచికలపేటలో సముద్రాల శంభులింగం ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

దుర్గంపేట్‌లో..

దామెర : మండలంలోని దుర్గంపేట్ గ్రామ బీఆర్ఎస్ కమిటీ అధ్యక్షుడు చెల్పూరి చంద్రయ్య తండ్రి నర్సయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నివాళులర్పించారు. నర్సయ్య ఇటీవల మృతి చెందగా అతడి కొడుకు చంద్రయ్య ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి ఓదార్చారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, వైస్ ఎంపీపీ జాకీర్, పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు తదితరులున్నారు.

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మసికె ఆగయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని సీబీఐ సీఐ విశ్వనాథ్ జయప్రకాశ్ పరామర్శించారు. తొలుత ఆగయ్య చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

శాయంపేట : బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వామపక్షాలు ఉద్యమిస్తున్నాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి తెలిపారు. మండలానికి చెందిన ఐరబోయిన చేరాలు, కళ, లక్ష్మీ, ఆమల ఆధ్వర్యంలో సుమారు 50 మంది మహిళలు పార్టీలో గురువారం చేరగా వారికి భిక్షపతి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం భిక్షపతి మాట్లాడారు. పేదలకు అండగా నిలవడమే పార్టీ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బత్తిని సదానందం, అనుకారి అశోక్, అరికిళ్ల దేవయ్య, మారపల్లి క్రాంతికుమార్, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యాన్ని కాపాడే ఆహారం కావాలి

ధర్మసాగర్ : ప్రజారోగ్యాన్ని కాపాడుతూ, పర్యావరణానికి హాని కలిగించని ఆహారోత్పత్తులను తయారు చేసుకోవాలని పర్యావరణవేత్త, జన విజ్ఞాన వేదిక కన్వీనర్ ధర్మప్రకాష్ సూచించారు. ఆహార పంటల్లో కృత్రిమ జన్యు మార్పిడి అవసరమా అనే అంశంపై ధర్మసాగర్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ సాగులో కృత్రిమ రసాయనాల వాడకం అధికమైందని ఆందోళన వ్యక్తం చేశారు. పంట విత్తనాల్లోకి కార్పొరేట్ రంగం విస్తరించిందని వాపోయారు. ఆహార పంటల్లోకి బీటీ సాంకేతికత వద్దని అప్పటి ప్రతిపక్ష ఎన్డీఏ పార్టీలు వ్యతిరేకించి పోరాటం చేశాయని గుర్తుచేశారు. అయితే, మళ్లీ ఇప్పుడు అవే పాలక ఎన్డీఏ పార్టీలు.. బీటీ సాంకేతికతను ఆమోదించి, ఢిల్లీ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త రూపొందించిన ఆవాల పంట విత్తనాలను విడుదల చేస్తున్నట్లు చెప్పారు. దీన్ని భారతీయ జన సంఘ్ స్వదేశీ జాగరన్ మంచ్ వ్యతిరేకిస్తోందని వివరించారు.

క్రీడలపై ఆసక్తి పెంచేందుకే టోర్నమెంట్

● 'ఏజీఎఫ్' సెక్రటరీ అరూరి విశాల్



మాట్లాడుతున్న అరూరి విశాల్

ఐనవోలు : యువతకు క్రీడల్లో ఆసక్తి పెంచేందుకే టోర్నమెంట్లు నిర్వహిస్తున్నట్లు అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ (ఏజీఎఫ్) సెక్రటరీ అరూరి విశాల్ తెలిపారు. మండల కేంద్రంలో ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేసీఆర్ ప్రీమియర్ లీగ్ పేరుతో నిర్వహిస్తున్న వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను డీసీపీ కరుణాకర్, మామునూర్ ఏసీపీ కృపాకర్‌తో కలిసి విశాల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విశాల్ ప్రసంగించారు. ఫౌండేషన్ ద్వారా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదలకు, విద్యార్థులకు, క్రీడాకారులకు ఆర్థికంగా అండగా నిలిచినట్లు చెప్పారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో వేలాది మందికి నిత్యావసర సరుకులతోపాటు ఆర్థికసాయం అందించి అండగా నిలిచామన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో భోజన వసతిని కల్పించి 100 రోజుల పాటు సుమారు 4 వేల మందికి ఉచితంగా శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలను గ్రామీణ యువత అందిపుచ్చుకునేలా పలుమార్లు జాబ్‌మేళా నిర్వహించినట్లు చెప్పారు. వృద్ధులకు, వికలాంగులకు చేయూత అందిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులకు, చర్చి పాస్టర్లకు సముచిత స్థానం కల్పిస్తు గౌరవిస్తున్నట్లు వివరించారు. క్రికెట్ టోర్నీలో మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు, సూపర్ 8కు అర్హత సాధించిన ప్రతి టీంకు రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఎంపీపీ మార్నేని మధుమతి, నాయకులు ఉస్మాన్ అలీ, తక్కళ్లపెల్లి చందర్‌రావు, మునిగాల సమ్మయ్య, పోలెపల్లి శంకర్‌రెడ్డి, బుద్ర రాజశేఖర్, దుప్పెల్లి కొంరయ్య, పల్లకొండ సురేష్, అనిల్, రాఘవులు, నరేష్, అరుణ్‌కుమార్, జన్ను కుమారస్వామి, కొత్తూరి కల్పన, దేవేందర్, మధుకర్, రాజు, సతీష్, పరమేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ముక్కిపోయిన బియ్యం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ, ఆర్‌ఐ

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లె గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బియ్యం ముక్కిపోయిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ బుధవారం మీడియా దృష్టికి తీసుకురాగా గురువారం ఎంఈఓ రమాదేవి, ఆర్‌ఐ లావుడ్య హేమనాయక్ పరిశీలించారు. తొలుత ఎంఈఓ రమాదేవి, ఆర్‌ఐ హేమనాయక్ పాఠశాలకు చేరుకుని ముక్కిపోయిన బియ్యాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి బియ్యం విషయం అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాకు వివరాలు వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవేందర్ గౌడ్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్నం భోజన బియ్యం పురుగులు పట్టి ముక్కిపోయి ఉండటాన్ని ప్రతికాముఖంగా వెలుగులోకి తెచ్చిన క్రమంలో విచారణ చేసినట్లు తెలిపారు. సదరు పురుగుల పట్టి ముక్కిపోయిన బియ్యాన్ని 10 రోజుల క్రితమే ఉపాధ్యాయులు పక్కకు పెట్టినట్లు చెప్పారు. బియ్యాన్ని మార్చి ఇవ్వనునట్లు ఆర్‌ఐ వివరించారు.

ఉపాధి కల్పనే 'జీఎంఆర్‌ఎం' ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న గౌతంరెడ్డి

శాయంపేట : యువతకు ఉపాధి కల్పించడమే జీఎంఆర్‌ఎం ట్రస్ట్ ధ్యేయమని జనరల్ సెక్రటరీ గంద్ర గౌతంరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో సోషల్ మీడియా కన్వీనర్లతో గురువారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రస్ట్ ద్వారా అనేక రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో మండల కేంద్రంలో యువతకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇప్పించి లైసెన్స్‌లు అందించే ప్రకియ చేపడతామన్నారు. సేవే మార్గంగా ట్రస్ట్ పని చేస్తోందని తెలిపారు. అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్లు చెప్పారు. పేదలకు అపన్నహస్తమై, యువతకు మార్గం నిర్దేశికంగా పని చేస్తున్నట్లు వివరించారు. సోషల్ మీడియా కన్వీనర్లు కూడా ట్రస్ట్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం గౌతంరెడ్డిని నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారపల్లి నందం, సోషల్ మీడియా మండల కన్వీనర్ మామిడి అశోక్, రాజుపల్లి సర్పంచ్ గజ్జెల లావణ్య రాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజేందర్, ఉపసర్పంచ్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా విద్యుత్



అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

నడికూడ : ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు చెందిన వినియోగదారులకు నెలకు 101 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ దేవేందర్ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆ శాఖ సిబ్బందితో కలిసి గురువారం ఆయన పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యుత్ సదుపాయం లేని వ్యక్తులు దరఖాస్తు చేసుకుని విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కుల ధ్రువీకరణతోపాటు ఆధార్ కార్డు, ఇంటి పన్ను జిరాక్స్‌లు జత చేసి మీ సేవా కేంద్రాల్లో రూ.1050 చెల్లించి దరఖాస్తు చేసుకుంటే మీటర్ మంజూరౌతుందని తెలిపారు. విద్యుత్ చౌర్యం నేరమని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా విద్యుత్ వినియోగిస్తున్న వ్యక్తులు సర్వీస్ రెగ్యూలరైజేషన్ చేసుకోవాలని చెప్పారు. లేనిపక్షంలో చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు చెందిన పేదలకు 101 యూనిట్లు వరకు ప్రతినెలా ఉచితంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊర రవీందర్‌రావు, ఏఈ విశ్వప్రసాద్, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్లుగా రాణించాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు

హసన్‌పర్తి: ప్రతివిద్యార్థి ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. భీమారంలో ఎస్‌వీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో 'వర్క్‌షాప్ ఫర్ ప్రొఫెషనల్ స్టూడెంట్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు కొనసాగనున్న సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కారు ఉద్యోగాలపై ఆధారపడకుండా పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఈక్రమంలో విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. ఎస్‌వీఎస్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి సువర్ణ మాట్లాడుతూ కళాశాలలో మరిన్ని సెమినార్లు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిమ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బోయినపల్లి ప్రతీక్, డాక్టర్ ఎర్రబెల్లి హర్షిణి, స్కిల్స్ స్పోర్క్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ ఎర్రబెల్లి అనూప్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణాల వైపు దృష్టి సారించాలన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.